# శారదలేఖ

> హిందూ మహమ్మదీయు లీదేశమున వస్త్రములోని పడుగు పేకలవలె కలిసియున్న మాట వాస్తవము. వస్త్రమునందలి యేవైపుదారములు దూసినను వస్త్రముయొక్క రూపమెట్లు విచ్ఛిన్నమగునో అటులనే హిందూ మహమ్మదీయులలో నెవరిని విడదీసినను భారతదేశ స్వరూపమును విరూపమగును.

సౌభాగ్యవతి కల్పలతకు,

నెచ్చెలీ! భరతవర్షమనియు, భరతఖండమనియు, విఖ్యాతనామమువహించి యుగయుగములనుండియు నొక్కటే గడ్డగనున్న మన హిందూస్థానమునకు ఎన్నిముప్పులు వచ్చినవి! ఆస్తిపాస్తులపంపకములో నధిక భాగమునకై పోరాడు అన్నదమ్ములెందైన నుందురుగాని మాతృగర్భమును రెండుముక్కలుగజీల్చి పంచుకొను మందభాగ్యులెందైన నుందురా? మన భారతదేశమున నానాటికి ప్రబలమగుచున్న మతవర్ణశాఖా వివాదముల వైఖరిచూడ నాచందముగనేయున్నది. ఈ వివాదముల యుద్ధతి చూచినకొలది భరతవర్షాభ్యుదయమునకు వేరుపురుగై పరదేశీయ పాలనమునకు హేతుభూతమై మన భారతీయుల సర్వనాశ మొనర్చిన అనైకమత్యము ఈనాటికిని మనలను వీడలేదుగదాయని విచారమగుచున్నది.

మన ఆర్యావర్త మీనాటిదా! ఎంత ప్రాచీనమైనది? ఈ పుణ్యభూమి జీవితము వేల సంఖ్యలపై లెక్కింపవలసినదేగాని దశాబ్దములు, శతాబ్దములు చాలవుగదా! ఎన్నిమతములిందు జనించినవి! ఎన్నిపరమతము లిందు వ్యాప్తిగాంచినవి! ఎన్ని మతకలహములను, ఎన్ని సాంఘికవిప్లవములను, ఎన్ని సాంప్రదాయ సంఘర్షణలను కనులగాంచినదీ ఆర్యభూమి! హిందువుల చేయిజారి ఒక్కొక్కప్పుడు ఒక్కొక్క భిన్నమతస్థుడు రాజై తన మతసంఘ సాంప్రదాయముల నీ భరతవర్షముపై వ్యాపింపజేయునాడైన నీదేశమును ముక్కలు ముక్కలు తెగగొట్టి మతములబట్టి విభజించియుండలేదే? బాబరు, హుమాయూను, అక్బరు, జహాంగీరు, షాజహాను మున్నగు మొగలాయి చక్రవర్తులు పాలించునాడేమి; తుదకు మతపక్షపాతియని పేరొందిన ఔరంగజేబు పాలించునాడేమి తన మహమ్మదీయ మతవ్యాప్తికై ప్రాకులాడుటేగాని యీ భరతవర్షమును మతములబట్టి విభజించి దేశజననిని వికారాకారగ జేయుటకు సాహసించియుండలేదే! నేడు జిన్నాప్రభృతులకీ యాగడంపు తలంపేలగల్గెనో! దురూహ్యముగా నున్నదిగదా.

హిందువులు వేఱట మహమ్మదీయులు వేఱట! మతసంఘ సాంప్రదాయములలోనేమి వేషభాషా వ్యవహారములలోనేమి ఉభయులకు పొత్తేలేదట. అందువలన నీ భారతదేశమును హిందూ రాజ్యమనియు మహమ్మదీయ రాజ్యమనియు రెండుగ విభజింపవలెనట. ఎంత విపరీతమగు కోరికయిది! ఎన్ని శతాబ్దముల నుండి హిందూమహమ్మదీయు లీదేశమున కలసిమెలసియుండలేదు? ఇందువలన వీరికిదివరలో జరిగిన అపకార మేమి? నేడు వాటిల్లనున్న ప్రమాదమేమి? ఏమియులేదు. నిజమునకు హిందూమహమ్మదీయు లింతకాలము

నుండియు కలసియుండుటచే గల్గిన నష్టమిసుమంతయు ముమ్మాటికిని లేదుగాని, యికముందు రెండుఖండములుగా విభజించుటచే గల్గునష్టము మాత్రము అపారమని చెప్పకతప్పదు.

ఏలనన? ఇచట హిందూ మహమ్మదీయులను ద్వివిధమతస్థులేగాక పారశీకులు, సిక్కులు, క్రైస్తవులాదిగాగల యితరమతములవారును చాలమందిగలరు. ఒకమతమువారు విడిపోయి తమదేశమును ప్రత్యేకముగా నేర్పరచుకొనినపుడు తదితరమతములవారికిని అట్టి వాంఛగలుగుట సహజము. అప్పుడు క్రైస్తవులు సిక్కులు మున్నగువారును తమ భాగమును తమకీయవలసినదని పోరాడవచ్చును. అప్పుడీ ఆర్యావర్తమును రెండు ఖండములుగా గాక నాలుగైదు ఖండములుగా విభజింపవలసివచ్చును. ఇంతటితో నీవిభాగసమస్య పరిష్కారమైన మేలే. కాని యీ మతములలో నెన్నియో శాఖలున్నవి. వారిలో వారికి సుతరాముపడదు. మహమ్మదీయ మతమునకుజెందిన షియాసున్నీ తెగలవారు తమలోతమకు పడక నిరంతరమెట్లు పోరాడుకొని తలలు బ్రద్దలుకొట్టుకొని రక్తప్రవాహములు చేసికొనుచున్నదియు నిత్యము పత్రికలలో చదువుచునేయున్నాము. ఉత్తరహిందూస్థానమున నీ వివాదములుజరుగుచుండ మనమేల మిన్నకుండవలయునని కాబోలు మన దక్షిణ హిందూదేశమున తమిళనాడులో ఆర్యులు వేరనియు ద్రావిడులు వేరనియు వారునువీరును నెప్పుడును కలిసియుండలేదనియు, కాన నీదేశము ఆర్య ద్రావిడఖండములుగా విభజింపవలయుననియు నొక వాదము బయలువెడలినది. కనుక మతములనుబట్టి విభజించుటయే జరిగినచో శాఖలనుబట్టియు నార్య ద్రావిడ భేదములనుబట్టియు విభాగించుట అని వార్యమగును. అప్పుడు హిందూదేశమనునదియే లేకుండపోవును. అంతశ్శ్వైషమ్యములు వృద్ధి[illegible]గును. ఐకమత్యము ఊరుపేరులేకుండ నశించును. మహాత్ముడు మున్నగు మహానాయకులు చేయుచున్న స్వరాజ్య సంపాదనాయత్నములు విఫలములగును. పరదేశీయపాలన మిప్పటికంటె సుస్థిరమై యీ భరతఖండవాసులనెల్లర అవిచ్ఛిన్న దాస్యమున బంధించివైచును. కావున 'పాకిస్థానమ'ని చెప్పబడుచున్న యీ దేశ విభాగవిధానము గర్హింపదగినదిగాని ఆమోదింప దగినదిగాదు.

ఇంతకును తాము ప్రత్యేకజాతివారమనియు, తమకు ప్రత్యేకదేశ మేర్పడవలయుననియు నింతగా నలజడిచేయుచున్న యీ మహమ్మదీయ లేతురుష్కదేశమునుండివచ్చిరి? వీరిలో ముక్కాలు మువ్వీసము పూర్వమొకప్పుడు హిందువులైయుండి కారణాంతరములచే మహమ్మదీయమతమును స్వీకరించినవారేగాని పక్కా మహమ్మదీయులు కానేకారు. తుదకు ముస్లిము లీగను మహమ్మదీయ సంఘమునేర్పరచి యీ ఆందోళన సాగించుచున్న జిన్నాగూడ హిందూసంతతి వాడేననియు, పంజాబు ప్రధాని సికందర్ హాయత్ ఖాను క్షత్రియవంశము వాడనియు దృష్టాంతరములు చూపుచున్నారు. ఇదియే నిజమైన హిందూమహమ్మదీయులెల్ల రొక్క తల్లిబిడ్డలేయని స్పష్టమగుచున్నదిగదా. మన పురాణేతిహాసాదులలో మ్లేచ్ఛులనియు, యవనులనియు వర్ణింపబడిన వీరు తమ సంతతివారైనట్టును, తమ ఆజ్ఞాధిక్కారణంబు సేయుటచే వారినిట్టి కర్మభ్రష్టులనుగా శపించినట్టును విశ్వామిత్రాది మహర్షులచే చెప్పబడినది గాని అన్యులుగా తెలుపబడలేదు.

శ్రీమతి సరోజినీనాయుడు చెప్పినట్టుగా హిందూమహమ్మదీయు లీదేశమున వస్త్రములోని పడుగుపేకలవలె కలిసియున్న మాట వాస్తవము. వస్త్రమునందలి యేవైపుదారములు దూసినను వస్త్రము యొక్క రూపమెట్లు విచ్ఛిన్నమగునో అటులనే హిందూ మహమ్మదీయులలో నెవరిని విడదీసినను భారతదేశ స్వరూపమును విరూపమగును. కాన మాతృదేశాభిమానులైన వారెవరు గాని యీ ప్రత్యేక విభాగము కోరరాని కోరిక, చేయరానిపని, తలపరాని తలంపు. మహమ్మదీయు లీ దేశమునకు అరేబియానుండి క్రీ. శ.

712లో సింధురాష్ట్రము పైదాడి సాగింపవచ్చినను, నాటనుండియు వారు హిందువులతో కలసి మెలసి యేకోదరులచందమున నున్నారు. వారికిని వీరికిని సంబంధ బాంధవ్యములుకూడ కలిసినవి. హిందువులతోడి సంబంధమునకై అక్బరు మొదలైన చక్రవర్తులు చేసిన కృషి చరిత్రప్రసిద్ధము. హిందువులతోనేగాక హిందూ దేవతలతోగూడ మహమ్మదీయులకు సంబంధమున్నది. తిరుపతి, శ్రీరంగము ఆదిగాగల క్షేత్రములతో మహమ్మదీయులకుగల సంబంధములందఱెఱింగినవి. నబాబుకూతురగు బీ బీ నాంచారు హిందువులదేవుడైన రంగనాయకస్వామిని ప్రేమించి వరించి పతిగాజేసికొనిన వృత్తము చరిత్ర ప్రసిద్ధిగదా! ఆ పుణ్యక్షేత్రము యొక్క నామము మఱచితినిగాని తిరునల్వేలి జిల్లాలో నొక హిందూదేవాలయమునకు మహమ్మదీయుడు పూజారిగా నున్నాడు. అచ్చటి దేవార్చనకు వినియోగించునూనె సమస్త వ్యాధి పీడానివాకరమని హిందువులు భావింతురు. మహమ్మదీయులకు నృసింహస్వామి యిష్టదైవమనియు, ప్రతివత్సరము వారా స్వామికి గోప్యముగా పూజా పురస్కారములు చేసెదరనియు వింటిని. ఇది యెంతవఱకు నిజమో నాకు తెలియదుగాని మన భద్రాద్రిరాముడు ప్రతివత్సరము శ్రీ హైద్రాబాదు నవాబుగారంపిన తలంబ్రాలతో గాని కల్యాణ మహోత్సవము జరుపుకొనడను వృత్తాంతము మనమెల్లర మెఱిగినదేగదా. మహమ్మదీయులు హిందువుల దేవతలను పూజించినట్లే హిందువులు మహమ్మదీయ పీర్లకు మ్రొక్కుబడులు చెల్లించుటయు, మహమ్మదీయ సాధువులైన మస్తాను మొదలగువారి సమాధులను పూజించుటయు, ప్రాణాచారములు బడుటయు, వారి నామధేయములను తమబిడ్డలకు పెట్టుకొనుటయు అనాదిగాజరుగుచున్న ఆచారము.

విశాలమగు దేశములో భిన్నమతములును భిన్నకులములును ఉండుట సహజము. భోజన ప్రతి భోజనములందును, సంబంధ బాంధవ్యముల పట్లను అవి అవిలంఘ్యనీయములు గానే యుండవచ్చును. చిరకాలమునుండివచ్చు నాచారములనొక్కమారుగా తుడిచివేయుటకు సాధ్యము కాకపోవచ్చును. అంత మాత్రముచేత దేశవ్యవహారములలో వానికి జోడుకలిపి విభజనమార్గమును బట్టుట దేశద్రోహము గాక మఱేమి ?

నేడు అంగ్లదేశమున జూడుము! దేశమునకు యుద్ధోపద్రవము రాగానే భిన్నభిన్న పక్షములకుజెంది నిరంతరము పోరాడుకొనువారెల్ల రొక్క మంత్రివర్గముగాజేరి దేశరక్షణ కెట్లు పూనుకొనిరో! ఆహా! ఐక మత్యమన నిట్లుగదా యుండవలయును! దేశాభిమానమనిన నిట్లుగదా యుండవలయును!

మనము హిందువులముగాము, మహమ్మదీయులముగాము, క్రైస్తవులముగాము, ఈ భారతదేశమున జన్మించితిమిగాన భారతీయులము; కాన యీ భారతవర్షాభ్యుదయమునకై శక్తి వంచనలేక పాటుబడుట భారతీయులవిధి; తద్భిన్నముగ వర్తించుట వివేకహీనము.

కల్పలతా! ఇప్పట్టున భారతీయమహిళామణులెల్లరు మతైక్యమునకును,సంఘైక్యమునకును పాటుబడు నవసరమెంతేనిగలదు. అఖిలభారతమహిళాసభ యీ ఆదర్శముతోనే నడచుచుండుట సంతోషకరమగు విషయము. అయినను అంతటితో తృప్తినందక సామాన్య సామాజికవ్యవహారములందును నితరమతస్థులతో సంబంధము కలుగజేసికొని వారి సమావేశములకు వీరును వీరి సమావేశములకు వారును బోవుచు మతైక్యము నకై పాటుబడుట మన స్త్రీలెల్లరి ధర్మమైయున్నది.

తమ పరిపాలనను సుస్థిరమొనర్చుకొనుటకై మతమునకు మతమునకుమధ్యను, తెగకు తెగకుమధ్యను విభేదములు గల్పించి పరస్పర వైషమ్యములు పెంపొందజేయుట చిరకాలమునుండియు మన ప్రభుత్వమువారు

అవలంబించుచున్న నీతిగా ఉన్నది. ఆదినుండియు వారీ విభేదనవిధానమువల్లనే రాజ్యమును సంపాదించి పాలించుచున్నారు. ఈ విషయము చక్కగా నెఱిగియుండియు, ఇందువలన గలుగు దేశానర్థకము గుర్తించియు స్వార్థపరులు కొందఱు వారికి లోబడి ప్రజలలో కలవరము గల్గించి వానికి ద్రోహదము చేయుచున్నారు. నిజమునకు విద్యాధికులలోనే నీ విభేదవ్యాధి వ్యాప్తమైయున్నది గాని జనసామాన్యములో నీ పొరపులు లేనేలేవు. పీర్ల పండుగ రాగనే చూడుము, అది మహమ్మదీయుల పండువనుతలంపే జనులలో నుండదు. మహమ్మదీయులతో బాటు హిందువులును పులివేషములు వేసి ఉల్లాసముతో వ్యవహరింతురు. కాన యీ విభేదములు స్వార్థకల్పితములుగాని సహజములుగావు. వీనిని నిర్మూలించుటే ప్రతివారును నిప్డు చేయవలసినపని. మతవిభేదములచేతనే దేశమల్లకల్లోలమగుచుండ, కులసభలును, శాఖాసభలునుగూడ వీనికితోడై దేశములో వైషమ్యములను బెంచుచున్నవి. వీనిలో విద్యాధికలైన మన స్త్రీలును పాల్గొనుచుండుట మఱింత సంతాపకరముగనున్నది. నేను మున్నొకప్పుడు జెప్పినట్లుగా ఆయుధ నిర్మాణమున్నన్నాళ్లు యుద్ధభయము తప్పదన్నట్లు ఈ మతవర్ణశాఖా సభలున్నన్నాళ్లు విభేదముల దురదృష్టమును తప్పదు. ఈ కులసభల నామోదించువారు కొద్దిలో పేరు సంపాదించుకొని తమ ఆధిక్యతను పెంపుచేసికొనవచ్చును. కాని దేశమునకు మాత్రము వీరుపకృతి చేసినవారు కాజాలరు. అఖిలభారత కల్యాణమే ఆదర్శముగా నుంచుకొనుట దేశక్షేమాభిలాషుల ధర్మమని నా దృఢాభిప్రాయము. యథాశక్తి మనమందులకే పాటుబడుటకు భగవానుడు మనకు శక్తియుక్తుల బ్రసాదించుగాక!

భావపురి }
౧—౬—౪౦ }

మిత్రురాలు,
శారద.

## ❁ అబలలము కాము ❁

శ్రీమతి వక్కలంక రామాబాయి

అబలలము కాము తేజమ్ము నందినట్టి గృహిణులము మేము; మగవారి కూర్మిఁబడయ
లలితకళలను వ్యాపింప లాస్యగతిని కంకణముఁదాల్చు మమునేలు కన్నతల్లి.

బలము నరయగనున్నది భారతాంబ, కన్యవలె మాతవలె భూమి కష్టపడుచు
దేశసేవను నిరతంబు దేలువారమమ్మ, భారతమాతరో, యక్కజముగ.

లక్ష్మిగూర్పను బలుభంగి లలితకళల నెన్నొ, మాఇంట వృద్ధిగా నేర్పఱచుచు,
నుండువారము, పురుషుల నూర్జితమతి ద్రిప్పి కావంగరావమ్మ దేశమాత.

లలితమూర్తుల మేమన్చు లాలనమున బురుషశ్రేష్ఠులు మమునింటఁ బూడ్చుచుంద్రు,
కాని, యరయంగ నేరరు కార్యదీక్ష కులము మన మన్ననుడి, దానిఁ గూల్చుమమ్మ.

ముదముఁ గూర్తుము పతులకు ముద్దుచేఁత లెలమిఁ గొల్పెదు సేవకై యెదురు చనుద
మమ్మరో, దేశసేవను యనవరతము నుండునట్టుల భామల మన్పు తల్లి.

కాలగతి యాంధ్రరాష్ట్రంబు కాంచునటుల నాంధ్రస్త్రీలను దీవించి, యాదరించి
నిలుపగదవమ్మ, మగువల నిద్రఁబాపి భారతాంబరో, మాదగు బాధ్యతఁగని.

ముగుదలకుఁ బ్రీతి, కార్యంపు ముందుజేత సోదరావళి కలవడ, సొంపుదీర
దీవనల నిచ్చి మమునేలు దేశమాత సకలకల్యాణ గుణవతీ, శాంతమూర్తి!